

'వైఎస్ఆర్ కళ్యాణమస్తు' నిధులు జమ

నెల్లూరు : బాలికా విద్యను ప్రోత్సహిస్తూ వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ షాదీ తోఫా పథకాలతో పేద కుటుంబాల్లో సంతోషాలను నింపుతున్నామని ఎంఎల్సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా పథకాలకు సంబంధించిన ఆర్థిక సాయాన్ని తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం హరినారాయణన్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.ఎంఎల్సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లాలోని 409 జంటలకు సంబంధించిన 4.09 కోట్ల రూపాయల ఆర్థిక సాయాన్ని ఆడపిల్లల తల్లిదండ్రుల ఖాతాల్లో సీఎం జమ చేశారన్నారు. డి ఆర్ డి ఏ పిడి సాంబశివారెడ్డి, జిల్లా బిసి సంక్షేమ అధికారి వెంకటయ్య, ఎస్సి సంక్షేమ సాధికారిత అధికారి రమేష్ ఉన్నారు.

చెక్కు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్,జెడ్పి చైర్పర్సన్ ఆనం అరుణమ్మ

నగరం వణుకుతుంది..!

యువత, మహిళలు, సాధారణ జనం బయట తిరగాలంటే హడలి పోతున్నారు. ఎవరు.. ఎందుకు..ఎటు వైపు నుంచి వచ్చి దాడులు చేస్తారో తెలియడం లేదు. హత్యలు మంచినీళ్ల ప్రాయంగా చేసుకుపోతున్నారు. మద్యం, ఇతర వ్యసనాలకు అలవాటు పడ్డ కొందరు వ్యక్తులు రెచ్చిపోతున్నారు. ప్రధాన కోళ్లలో పగలు, రాత్రి తేడా లేకుండా హల్చల్ చేస్తున్నారు. పోలీసుల భయం కనిపించడం లేదు. అధికారపార్టీ నేతల ప్రోత్సాహంతో యువకులు మరింత రెచ్చిపోతున్నారు. పోలీసు అధికారులు అధికారపార్టీ నేతల సేవల్లో మునిగి తేలుతున్నారు. నెల్లూరు నగరం భయానక పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- మత్తు, మనీ కోసం హత్యలు
- గంజాయి, మత్తు పదార్థాలతో యువత చిత్తు
- పోలీసుల నిఘా వైఫల్యం
- అధికారపార్టీ నేతల సేవల్లో అధికారులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కూరగాయాలకు వెళ్లిన ఇద్దరు మహిళలను డబ్బు, నగల కోసం అతికిరా తరంగా హత్య చేశారు....ఇంట్లో నిద్రపోతున్న యువకుడిని నలుగురు యువకులు ఇంటికొచ్చి అత్యంత దారుణంగా నరికిచంపారు. అపోలో సెంటర్, మాగుంట లేవుట్, చిన్న బజార్, నగర శివారు ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులు చేస్తున్నారు. ఇటీవల కాలంలో మద్యానికి యువత బానిసలుగా మారుతున్నారు. ఇదే సమయంలో గంజాయి సరఫరా ఎక్కువగా ఉందని తెలుస్తోంది. అనేక సార్లు పోలీసుల దాడుల్లో బయటపడుతుంది. కాలేజీలు, కొన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మత్తు పదార్థాలు, స్వీకరిస్తున్నట్లు తెలుస్తోంది. చిన్న చిన్న విషయాలకు దారుణంగా హత్య చేస్తున్నారు. ఒకప్పుడు పోలీసులను చూసి భయపడే గుండాలు, రౌడీ షీటర్లు, దొంగలు ఇప్పుడు హల్ చల్ చేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం అధికారపార్టీ చోటా నేతల సపోర్టు ఉండడమే కారణంగా తెలుస్తోంది. ఏం జరిగినా అన్న చూసుకుంటాడనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. దారిన వెళ్లే వారిని గెలికి మరీ గొడవలకు దిగుతున్నారు. పరిస్థితులు సరిగా లేకపోవడంతో సర్దుకుపోతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఏం చేస్తారోనని భయం నగర ప్రజలను వెంటాడుతోంది. రెండు రోజుల క్రితం అపోలో ఆసుపత్రి వద్ద యువకుడిని ముగ్గురు యువకులు అందరూ చూస్తుండగానే దాడిచేసి వెళ్లిపోయారు. బుజబుజనెల్లూరు, సంతపేట, మాగుంట లేవుట్, ఇతర శివారు ప్రాంతాల్లోనూ సాయంత్రమైతే మత్తులో ఏం చేస్తున్నారో తెలియకుండా వ్యవహరిస్తున్నారు. వారం రోజుల క్రితం బుజబుజ నెల్లూరు ప్రాంతంలో ఇద్దరు మహిళలను అత్యంత దారుణంగా హత్య చేసిన విషయం మరువకముందే, ఎన్టిఆర్ నగర్ ప్రాంతంలో మరో యువకుడిని హత్య చేసిన విషయంలో నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎందుకు ఇంత బరితెగించి వ్యవహరిస్తున్నారనే విషయం పక్కన పెడితే నగరంలో పోకిరి బ్యాచ్ దారుణంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయాలు పోలీసు స్టేషన్ వరకు రావడం లేదు. కుటుంబ సభ్యులను ఇబ్బందులు తెచ్చిపెడుతారనే భయం ప్రజల్లో నెలకొంది. పోలీసుల పెట్రోలింగ్, భయం ఏ మాత్రమూ కనిపించడం లేదనే విమర్శలున్నాయి.

అధికారపార్టీ నేతల సేవల్లో..!

పోలీసులు కొందరు అధికారపార్టీ నేతలను చుట్టూ తిరుగుతున్నారు. పోలీసు స్టేషన్లల్లో కన్నా అధికారపార్టీ నేతలకు భద్రత పేరుతో కనిపిస్తున్నారు. ఎప్పుడు చూడని వింత పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎంపి, ఎంఎల్ఎల వెంట ఇద్దరు పోలీసు అధికారులు రెండు జీపులతో తిరుగుతున్నారు. మంత్రికి ఆయన బయటకొస్తే ఐదు పోలీసులు వాహనాల్లో కుయ్యుం కుయ్యుం అంటూ హడావుడి చేస్తున్నారు. గతంలో పోలీసు భద్రత ఉన్నప్పటికీ ఎందుకు ఇంత హడావుడి చేస్తున్నారో తెలియక జనం తలలు పట్టుకుంటున్నారు. అధికారపార్టీ నేతల దీవెనెలు ఉండాలనే కొందరు పోలీసు అధికారులు ఇలా చేస్తున్నారనే విమర్శలు న్నాయి. సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నారు. విధులు పూర్తి చేసుకొని ఇళ్లకు వెళ్లేవారిని నిలిపి పరీక్షలు నిర్వహించి, ఏదొక రకం రుసుం వసూళ్లు చేస్తున్నారు. రాత్రి 10 గంటల తరువాత బార్లలో మందుకొట్టి, మత్తు మందులు సేవించి స్కూటర్లలో తిరుగుతూ హారన్ కొడుతూ నానా హంగామా చేస్తున్నా పట్టించుకునే ఒక్క అధికారి కనిపించడం లేదు. ప్రతి రోజూ మాగుంట లేవుట్, మినీ బైపాస్-రోడ్డు, పొదలకూరురోడ్డు, ట్రంకు రోడ్డులో నిత్యం ఇదే సాగుతున్నా ఒక్కరు పట్టించుకోని పరిస్థితి కనిపించదు. పోలీసు తీరును ప్రజలు విమర్శిస్తున్నారు. ఇలాగే ఉంటే శాంతిభద్రతలు మరింత దారుణంగా మారే ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టకపోతే పరిస్థితి ఏలా ఉంటుందోననే భయం నెలకొంది.

నెల్లూరులో హత్యకు గురైన వ్యక్తి (ఫైల్)

హత్యకు గురైన జయమ్మ (ఫైల్)

హత్యకు గురైన రాజేశ్వరి (ఫైల్)

హామీలను అమలు చేయాల్సిందే..!

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి డిమాండ్

ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీని అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని, ఆర్థిక పరమైన సమస్యలను పరిష్కరించాలని ఎపి జెఎసి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, ఆర్టిసి ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న ఉద్యమంలో భాగంగా మంగళవారం మహాప్రదర్శన నిర్వహించారు. నగరంలోని సర్వోదయ కాలేజీ మైదానం నుంచి మద్రాసు బస్టాండ్ సెంటర్, పాత జెడ్పి కార్యాలయం మీదుగా కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, ఆర్టిసి ఉద్యోగులు, ట్రెజరీ ఉద్యోగులు, కార్మిక, మహిళా ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ఎపి జెఎసి జిల్లా చైర్మన్, ఎన్జిఒ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.పెంచలరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర జెఎసి వైస్ చైర్మన్, ట్రెజరీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు శోభన్ బాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరికి నిరసనగా, ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం తో గత కొన్ని రోజులుగా దశల వారీగా పోరాటం చేస్తున్నామన్నారు .ఉద్యోగులుగా తాము ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. తమకు రావాల్సిన న్యాయమైన వాటిని కేటా యించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తాము ప్రభుత్వం దగ్గర దాచుకున్న జిపిఎఫ్,ఏ పీ జీ ఎల్ ఐ,డబ్బులు,11 వ పీ ఆర్ సీ పెండింగ్ బకాయిలు అయిన డీ ఏ ఎరియర్స్, తమకు రావలసిన డీఏ లు,డీ ఆర్ లు,3 సంవత్సరా లుగా ఆగిపోయిన 3 సరెండర్ లివ్ నగదు చెల్లించకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి 2019లో ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలైన సిపిఎస్ ఉద్యోగులను ఒపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ నేటికి అమలుకు నోచుకోలేదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 12వ పిఆర్సి కమిషనర్ను నియమించి నెలలు గడుస్తున్నా సెక్రటేరియట్లో కమిషనర్కు, ఆయన సిబ్బందికి తగిన సౌకర్యాలు కల్పించలేదని వాపోయారు. ఇప్పుడున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పిఆర్సికి సంబంధించి ఫిట్మెంట్ ఇచ్చేలోపు ఐ అర్ 30 శాతం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె. అజయ్కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే దశల వారీగా ఉద్యమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఉద్య మాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఫిబ్రవరి 27వ తేదిన ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహించేందుకు పిలుపు నిచ్చారన్నారు. ఈ ఉద్యమానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఎపి జెఎసి నాయకులు తమ సమస్యలను రాష్ట్ర పభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కోశాధికారి బండారుపల్లి వెంకటేశ్వర్లు,అసోసియేట్ అధ్యక్షులు ఆంజనేయ వర్మ,ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకష్ణ, ఆర్ టీ సీ నాయకులు లూక్సన్,పీ ఎస్ రెడ్డి,టీచర్స్ సంఘ నాయకులు సురేంద్ర రెడ్డి,పిచ్చిబాబు, వెంకట శేషులు, శర్మ, దశరథ రామయ్య, హాజరత్తయ్య,ట్రెజరీ నేతలు కిరణ్,రమణా రెడ్డి,పెన్షనర్లు గౌస్,ఖాసీం,నరసింహచారి, అశోక్,ఎన్ గిరిధర్, రాజేంద్ర ప్రసాద్, కరుణమ్మ, వరలక్ష్మి,లక్కాకుల పెంచలయ్య, ఫార్మ సిస్ట్ రాష్ట్రఅధ్యక్షులు శ్రీనివాసులు, కృష్ణకు మార్,సువర్ణ,సందీప్,కష్ణ కుమార్,మధు నగర అధ్యక్ష కార్యదర్శులు చిలకా రామ కష్ణా రెడ్డి,డేగల మార్కండేయులు ఉన్నారు.

శ్రీనివాసరెడ్డిపై దాడి హేయం : టిడిపి

ప్రజాశక్తి-కందుకూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగురైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై ఒంగోలు నగరంలోని జిమ్స్ ఆసత్రి యజమాని డాక్టర్ రామచంద్రా రెడ్డి కుట్రపూరితంగా ఇనుపరాడ్డుతో దాడి చేయగా, అతని అనుచరులు కత్తులతో తీవ్రంగా దాడిచేసి హత్యాయత్నం చేయడాన్ని నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఖండించారు. శ్రీనివాసరెడ్డిపై దాడిచేసిన డాక్టర్ రామచంద్రా రెడ్డి , వారి అనుచరులపై హత్యాయత్నం కింద కేసు నమోదుచేసి తక్షణమే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను మోషే డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్సి విటపు బాలసుబ్రమణ్యం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి : విటపు

ప్రజాశక్తి-నెల్లూరు : పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎంఎల్సి విటపు బాలసుబ్రమణ్యం ఇమాండ్ చేవారు. స్థానిక భక్తవత్సలనగర్ ప్రాంతంలోని పెన్షనర్ల సంక్షేమ భవన్లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంఎల్సి, ఆ సంఘం గౌరవాధ్యక్షులు విటపు బాలసుబ్రమణ్యం పాల్గొని మాట్లాడారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో నిర్వహించతలపెట్టిన ధర్నా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో వాయిదా వేయిదా వేయాల్సి వచ్చిందన్నారుఉపాధ్యాయ ఉద్యమ నేత పి.బాబురెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మొండి వైఖరిని సభ్యులకు వివరించి సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్లు అందరూ ఐక్యం కావాలన్నారు. అనంతరం ఈఎన్ఈఎల్ వైద్యశాల వైద్యుల సహకారంతో ఉచిత వైద్యశిభిరం ఏర్పాటు చేశారు. పెన్షనర్లందరికీ వైద్యపరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్పివిఎన్ మూర్తి, అధ్యక్షులు ఎస్ఎం.గౌస్ ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సమాజ హితం కోరే రచనలు అవసరం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు బార్ అసోసియేషన్ న్యాయవాది, జాషువా సాహిత్య సాంస్కతిక సంస్థ అధ్యక్షుడు ముప్పవరపు కిషోర్ రాసిన పాలపిట్ట ధీర్ఘ కావ్యం కందుకూరు నియోజకవర్గం సామాజిక, సాంస్కృతిక రాజకీయ, సాహిత్య, ఆధ్యాత్మిక వైభవాన్ని వివరిస్తుందని కందుకూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మామిళ్లపల్లి మల్లిఖార్జున రావు పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు బార్ అసోసియేషన్ హాలులో ఏర్పాటుచేసిన పాలపిట్ట పోస్టర్ ఆవిష్కరణ కార్యక్ర మంలో భాగంగా ఆయన మాట్లాడుతూ సమాజం హితం కోరే రచనలు ప్రోత్సహించాన్నారు. సీనియర్ న్యాయవాదులు బెజవాడ కష్ణయ్య, టి.తిరుమలరావు, పోకూరి కోటయ్య, బట్టరుశెట్టి సాయి శంకర్, వలేటి శ్రీధర్ నాయుడు, గౌడపేరి కోటేశ్వరరావు, బి.వి.మురళీకష్ణ , సి హెచ్. హరికష్ణ, కె.మల్లిఖార్జున రావు, కె.రాజశేఖర రెడ్డి, పెట్లూరి మురళీ కష్ణ, అనంత సుబ్బరామయ్య , సి హెచ్ రాఘవేంద్ర ,చుండి మురళీ, షేక్ యాసిన్, పండిత్ సంపత్, షేక్ షంషుద్దీన్, చెనికల రమేష్,కరణం అరవింద్ కుమార్ ఉన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి
దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పాలిటెక్నిక్ కళాశాలలో (2024-2025) విద్యా సంవత్సరంలో చేరాల నుకునే విద్యార్థులు ఈనెల 20 నుంచి ఏప్రిల్ 05 2024 వరకు ఆన్లైన్లో దర ఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల పిన్సిపాల్ మస్తానయ్య కోరారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళా శాలలో వివిధ కోర్సులలో ప్రవేశం కోసం 27-04-2024 తేదీన జరిగే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని కోరారు. పది ఉత్తీర్ణత సాధించినవారు, పరీక్ష రాయబోతున్న విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. వివరాలకు 9866174419,2.7981057789 నెంబర్లకు సంప్రదిం చాలని కోరారు.

వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు
రిజిస్ట్రేషన్ చేసుకోవాలి : ఎస్ఇ

ప్రజాశక్తి నెల్లూరు : నూతన వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు రైతులు వారికి దగ్గరలోని సచివాలయంలో జగనన్న రైతునేస్తంలో రిజిస్టర్ చేసుకోవాలని ఎస్ఇ వి. విజయన్ పేర్కొన్నారు. మంగళవారం విద్యుత్ భవన్లో సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయ న్ విలేకర్లతో మాట్లాడారు. నూతన వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు రైతులు వారికి దగ్గరలోని సచివాలయంలో జగనన్న రైతునేస్తం లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. రైతులు ఆఫీసు దగ్గరికి రావలసిన అవసరం లేకుండానే సచివాలయంలో లిజగనన్న రైతు నేస్తంలి పోర్టల్ ద్వార అప్లికేషన్ పెట్టుకోవచ్చని తెలిపారు.

బియ్యం వితరణ

ప్రజాశక్తి-కందుకూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల టెన్త్ క్లాస్ ఫేర్వెల్ ఫంక్షన్ సందర్భంగా ఉపాధ్యాయులు విప్రనారాయణ మిత్రులైన సాయినాథ్ మెడికల్స్ ఇన్నమూరి ప్రసాదు,ఇన్నమూరి రవిచంద్రలు విద్యార్థుల భోజన నిమిత్తం మూడు బస్తాలు బియ్యమును విరాళంగా అందజేసారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం నరసింహమూర్తి, అభినందనలు తెలిపారు.

తిరుపతిలో ఎకరా రూ.60 కోట్లా..!

ప్రజల సొమ్మును దిగమింగారు.. - టిడిపి నేత ఆనం వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్కడ ఎంఎల్ఏ భూమన కరుణాకర్రెడ్డి ఆయన కుమారుడు అభినవ్రెడ్డి కలిసి పెద్ద మొత్తంలో ప్రజల సొమ్మును దిగమింగారని టిడిపి అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి, తిరుమలలో వైసిపి నేతలు, కొందరు అధికారులు కలిసి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 18 రోడ్ల నిర్మాణం కోసం 59 ఎకరాలు భూ సేకరణ చేశారన్నారు. ఒక్క ఎకరా సుమారు రూ.60 కోట్లకు కొనుగోలు చేశారని, బాండ్లు ఇచ్చారన్నారు. తిరుపతి పట్టణంలో ఎక్కడైనా ఇంతటి ధర ఉందా అని ప్రశ్నించారు. బాండ్లు ఇచ్చిన వ్యక్తిది ఆ భూమికాకపోయినా అధికారులు ఎలా బాండ్లు రిలీజ్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. దోపిడీలో కంచి రాము అనే వ్యక్తి టిడిఆర్ బాండ్తో కార్పొరేషన్లో 0356 బాండ్ పేరుతో రూ.61 కోట్లు ఇచ్చారన్నారు. ఆ భూమి కంచి రాముదే కాదన్నారు. ఈ విషయాన్ని జెసి తిరుపతి చెప్పారని, ఇందులో గోల్మాల్ ఉందని చెప్పారన్నారు. జెసి రెవెన్యూ కోర్టులో కేసు ఉంటే ఆయనకు ఎలా బాండ్లు ఇచ్చారన్నారు. తహశీల్దారు, ఆర్డిఒ, జెసి, కలెక్టర్కు తెలిసినా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఐఎఎస్ అధికారులకు విషయం తెలిసినా బరితెగించి వ్యవహరించారన్నారు. భూమి లేని వ్యక్తికి రూ.61 కోట్లు ఎలా ఇచ్చారని, అధికా రులందరిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ ఛేశారు. అధికారుల ఆస్తులు రికవరీ చేయాలన్నారు. మురళీ 00062 బాండ్ పేరుతో రూ.13 కోట్లు ఇచ్చారన్నారు. ప్రభుత్వం రిజిస్టర్ విలువ రూ 10 వేలు ఉంటే, 14 నెలల్లో దానిని రూ.1.60 లక్షలు చేశారన్నారు. టిటిడి ఇఒ ధర్మారెడ్డి వియ్యంకుడుకు కె. వెంకటరమణారెడ్డికి తిరుమలలో రూ.53 కోట్లా 72 లక్షలు బాండ్స్ ఇచ్చారన్నారు. తిరపతి కలెక్టర్కు ఆదాలతో చూపిస్తే కనీసం విచారణ జరపడం లేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతి సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు.

మీడియాతో మాట్లాడుతోన్న ఆనం వెంకటరమణారెడ్డి

శనగ పంటను పరిశీలిస్తున్న రైతులు

కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డా.జి.ప్రసాద్ బాబు పామూరు మండలం లోని దూబగుంట గ్రామంలో నంద్యాల శనగ - 452 రకం పై క్షేత్ర దినోత్సవం మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు రైతులు అడిగిన సందేహాలకు సలహాలు, సూచనలు సమాధానాలు ఇచ్చారు. రిలయన్స్ ఫౌండేషన్ సమన్వయకర్త ఆంజనేయులు, రైతులు, రైతు మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామారావు

విద్యార్థులకు సూచనలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జి రామారావు మాట్లాడుతూ10వ తరగతి విద్యార్థులకు జరగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులకు కొన్ని సూచనలు, కెరీర్ గైడెన్స్పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిబాబు పదో తరగతి బోధించు ఉపాధ్యాయులు, విద్య ఆవశ్యకత ,తల్లిదండ్రులు పట్ల, సమాజం పట్ల , విద్యార్థులు సామాజిక బాధ్యతో మెలగాలని సూచించారు. భాగంగా ఓగూరు సిద్ధార్థ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబురావు ఉన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి -పొదలకూరు : మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన నారాయణమ్మ మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును మంగళవారం దుండగులు లాక్కెళ్లారు. పర్వతాపురం గ్రామానికి చెందిన నారాయణమ్మ సొంత పనిపై పులికల్లు గ్రామానికి వెళ్ళింది. అక్కడ నుంచి తిరిగి స్వగ్రామానికి నడిచిపోతుండగా వెనకనే బైక్ పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఫిర్యాదు మేరకు కండలేరు డ్యాం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనుబోలులో ముస్లిముల భారీ సభ

మైనార్టీల సంక్షేమం టిడిపితోనే : సోమిరెడ్డి

ప్రజాశక్తి -మనుబోలు : ముస్లిం, మైనార్టీలు భారీ బహిరంగ సభలో మనుబోలు మండల కేంద్రలో జరిగింది. మంగళవారం స్థానిక సిపిఆర్ కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి మైనార్టీ సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి నుంచి కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి పొలిట్బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్రెడ్డి మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి కోసం టిడిపి కృషిచేస్తుందన్నారు. విద్య ద్వారానే వికాసం సాధ్యమని భావించిన చంద్రబాబు ముస్లింలలో విద్యావ్యాప్తికి ఎంతో కృషి చేశారన్నారన్నారు. విదేశీ విద్యకు పెద్దఎత్తున సాయం అందించి ముస్లిం విద్యార్థులకు అండగా నిలిచారన్నారన్నారు. ముస్లిముల పట్ల ఆయన ఎంతో శ్రద్ధ చూపారన్నారని, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించి ఆర్థిక సాధి కారతకు చేయూతనిచ్చారన్నా రన్నారు. దుల్హన్ పథకం ద్వారా పేద ముస్లిం ఆడపిల్లల పెళ్లికి సాయం చేశారన్నారన్నారు. పవిత్ర రంజాన్కు కానుకలు అందించడంతో పాటు మసీదుల నిర్మాణం, మరమ్మతులకు నిధులు కేటాయించారన్నారన్నారు. ఇమాం, మోజామ్లకు వేతనాలు అందించిన ఘనత చంద్రబాబుదన్నారు. హజ్ యాత్రకు ఆయన చేసిన సాయం మరువలేని దన్నారన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన స్టేట్ మైనారిటీ నాయకులు మౌలానా మస్తాక్, నాగుళ్ మీరా మాట్లాడుతూ, జగన్ పాలనలో ముస్లింలపై దాడులు పెరిగాయన్నారు. జగన్కు ముస్లిములు బుద్ధి చెప్పాలని కోరారు.

మనుబోలులో భారీ టిడిపి అధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించిన ముస్లిములు

బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి సూపర్ 6 పథకాలపై ప్రజల్లో తీవ్రమైన ఆసక్తి ఉందని, చంద్రబాబు ప్రకటించిన పథకాలు బాగున్నా యంటూ ప్రజల నుంచి ప్రశంసలు వస్తున్నాయని టిడిపి కందుకూరు నియోజకవర్గ ఇన్ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు పట్టణంలో ఆయన మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 27వ వార్డు పరిధిలోని పడమటి రజకపాలెం ప్రాంతంలో ఇంటింటా తిరిగారు. తెలుగుదేశం - జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను నాగేశ్వరరావు వివరించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శీను, వార్డు అధ్యక్షులు పాకల మాల్యాద్రి, కొచ్చర్ల వెంకటేశ్వర్లు కొచ్చర్ల వీరరాఘవులు, తలమంచి రాజేష్, కొత్తకోట మాల్యాద్రి, పోకూరి బ్రహ్మయ్య, చెన్నాయపాలెం మధు, తలమంచి సురేష్, కొవూరి శీను, తలమంచి వెంకటేశ్వర్లు, తలమంచి రమణయ్య, ఆత్మకూరి మాల్యాద్రి, బ్రాహ్మణకాక మాల్యాద్రి ఉన్నారు.

వికలాంగులకు టిడిపి అండ

ప్రజాశక్తి-కావలి : రాష్ట్రంలో వికలాంగులకు టిడిపి అండగా ఉందని టిడిపి నేతలు పేర్కొన్నారు. ముసునూరులోని వికలాంగుల కాలనీలో చంద్రబాబు నాయుడు ప్రతినిధిగా టిడిపి రాష్ట్ర ఎస్‌టిసెల్ కార్యదర్శి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య ఆధ్వర్యంలో మంగళవారం వికలాంగుల స్థితిగతులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులకు ఏం అవసరమో, ఆయా నియోజకవర్గంలో పార్టీ ఇన్‌ఛార్జి వికలాంగులకు కలిగిస్తున్న ప్రాధాన్యతలు, ఆర్థికంగా దౌర్జన్యాలు, అక్రమాలు మొదలైన వాటిపై టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు నివేదిక అందజేస్తాంమని కల్లయ్య తెలియజేశారు. అయనతోపాటు బిసి నాయకులు గుండ్లపల్లి మురళి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు స్థానిక వికలాంగుల కాలనీ ప్రెసిడెంట్ మండవ వెంకట్రావు మాట్లాడుతూ వికలాంగులకు వికలాంగత్వ శాతం ప్రకారం రూ.6వేల నుంచి రూ.10వేలకు పెన్షన్లు పెంచాలన్నారు. వికలాంగులకూ నైపుణ్య అభివృద్ధి శిక్షణను అందించాలన్నారు. వికలాంగులకు స్వయం ఉపాధికి ఆర్థికసాయం అందించాలన్నారు. కావలి 16వ వార్డు వికలాంగుల కాలనీలో వైసిపి నాయకులు 4 ఫ్లాట్స్ ఆక్రమించి, అక్రమ కట్టడి చేశారన్నారు. వికలాంగుల స్వయం ఉపాధి సంఘాలు జగన్ రెడ్డి నిర్వీర్యం చేశారన్నారు. అంత్యోదయ కార్డులు వికలాంగులం దరికీ ఇవ్వాలన్నారు. ఇంట్లో ఉన్న వికలాంగులందరికీ పెన్షన్స్ ఇవ్వాలన్నారు. ఇంటిలో ఒక్క యూనిట్ వికలాంగుడున్నా రేషన్ కార్డు ఇవ్వాలని కోరారు. కార్యక్రమం మండవ వెంకటరావు అధ్యక్షతన నిర్వహించారు. కావలి నియోజకవర్గ అధ్యక్షులు నన్నూరి మాధవరావు, జిల్లా నాయకులు షేక్ మహబూబ్ భాషా, రాష్ట్ర నాయకులు కోడూరు సోమయ్య, ఉప్పటాల రవి, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి దగదర్తి చెరుకూరి రమమ్మయ్య, అమిరిచెట్టి వెంకటేశ్వర్లు, కావలి గాలం మాలకొండయ్య, జలదంకి మండలాధ్యక్షులు పి.భాస్కర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధికి సమిష్టి కృషి

- మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను మున్సిపల్ శాఖ అన్ని విభాగాల ద్వారా పూర్తి పర్యవేక్షణ చేపట్టి వార్డుల అభివృద్ధి కోసం సమిష్టిగా పని చేద్దామని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 9వ వార్డులో వార్డు కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, వైసిపి ఇన్‌ఛార్జి చిన్నపరెడ్డితో కలిసి వార్డులోని అన్ని వీధులను కమిషనర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల సిబ్బందితో వార్డులు పర్యవేక్షించినప్పుడు అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని అందుకోసమే అన్ని శాఖల సిబ్బందితో వార్డు పర్యటిస్తున్నామని తెలిపారు. అలాగే ఆయన 27వ తేదీన ఈ వార్డులో ఎంఎల్‌ఎ విక్రమ్ రెడ్డి పాల్గొని విజయభావ కార్యక్రమం కూడా ఉన్నందున వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకొని పర్యవేక్షణ ఏర్పాట్లు స్థానిక వార్డు కౌన్సిలర్ ద్వారా తెలుసుకొని కార్యక్రమం విజయవంతం చేసేందుకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన స్థానిక వార్డు కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి మాట్లాడుతూ 27వ తేదీన తమ వార్డులో పర్యటించేందుకు తమ ఎంఎల్‌ఎ రావడం సంతోషమని, అందుకు తమవార్డులోని కార్యక్రమాల పర్యవేక్షణ కోసం మున్సిపల్ కమిషనర్ నేడు వచ్చి ఇక్కడి ఏర్పాట్లు సంబంధించిన సలహా సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. వార్డులో స్థానికులు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందిగా సంబంధిత సిబ్బందికి కమిషనర్ ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఇ ప్రసాద్, ఆర్‌ఐ ఖాసీం పాల్గొన్నారు.

రిపోర్టర్‌పై దాడి అమానుషం

ప్రజాశక్తి-కావలి : ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌పై దాడి అమానుషమని దళిత సంఘాల సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. మంగళవారం కావలి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ రోజుల క్రితం అనంతపురం జిల్లా రాప్తాడులో వైఎస్‌ఆర్ పార్టీ సమావేశం జరుగుతుండగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ ఫోటోలు తీస్తున్నాడని అత్యంత దారుణంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు తరిమి కొట్టడం అత్యంత హేయమైన కార్యక్రమం అని అన్నారు. ఇంత దుర్మార్గమైన చర్యలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సహించడం ప్రజాస్వామిక విరుద్ధమన్నారు. దళితులను కూడా 68మందిని ఊచకోత కోస్తే చంపిన వారిని చూసి నవ్వుకొనేవాడన్నారు. పత్రికా విలేకరులకు అందరికీ భద్రత కల్పించాలన్నారు. జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి వెంకటరత్నం, తుపాకుల లక్ష్మయ్య, ప్రసాద్, వెంకట రత్నం పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జర్నలిస్టులపై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని ఎపిడబ్ల్యుజె యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు పలు రాజకీయ పార్టీల నేతలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణ పురవీధుల్లో నినాదాలు చేస్తూ బి ఎస్ ఆర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. అనంతరం అక్కడినుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు చేరుకుని ఆర్‌డిఒ కె.మధులతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా ఉపాధ్యక్షులు సోమ వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యవర్గసభ్యులు బి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్.వి సుబ్బారావు, ఎమ్‌డి రహమత్ అలీ, టిడిపి నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, సుంకర పెంచలయ్య చౌదరి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నలిశెట్టి శ్రీధర్, సిపిఎం నాయకులు డేవిడ్ రాజు, షేక్ సంధాని, ఆత్మకూరు నాగయ్య, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సిద్ధం పెంచల నరసయ్య, వాగాల శ్రీహరి, అశోక్ రెడ్డి, నియోజకవర్గ విలేకరులు పాల్గొన్నారు.

నాసిరకంగా స్కూల్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం సి.ఆర్.పాలెం పంచాయతీలో నూతనంగా కడుతున్న స్కూలు నిర్మాణం నాసిరకంగా ఉందని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్ రాజు, అంబేద్కర్ ఇండియన్ మిషన్ కావలి డివిజన్ అధ్యక్షులు ఇత్తల రమేష్ పేర్కొన్నారు. పాఠశాల నిర్మాణ పనులపై సోమవారం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కాపూరి బంగారయ్య, గాలి వెంకటేశ్వర్లు, దర్శగుంట వాసు, కర్ర మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

వలంటీర్లను సత్కరిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-సీతారామపురం : ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకు వెళ్తున్న వలంటీర్ల సేవలను ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి కొనియాడారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో వలంటీర్ల అభినందన సభలో ఆయన పాల్గొని మండలంలో ఉత్తమ వలంటీర్లను సన్మానించి సేవామిత్ర, సేవారత్న అవార్డు లతో ప్రశంసా పత్రాలను అందించి పారదర్శకంగా ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందించడమే వలంటీర్ వ్యవస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలకు సకాలంలో పని చేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఆయన కోరారు. వలంటీర్ వ్యవస్థను జాతీయ మీడియా సైతం మెచ్చుకుంటుందన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం వలంటీర్ వ్యవస్థ పై ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మంచి వ్యవస్థ కన్ను పడిపోవాలని వ్యవస్థ బాగుందని, మండలంలో వలంటీర్ల పనితీరు బాగుందన్నారు. గతంలో ప్రజలు చాలా పనుల కోసం మండలాల చుట్టూ తిరిగే వాళ్ళని ప్రస్తుతం ప్రజలు ఎక్కడికీ పోకుండా సచివాలయం ద్వారా వారి ఇంటి వద్దనే పనులు జరుగుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపులో వలంటీర్ల సేవలే భూమిక పోషిస్తాయన్నారు. 2024 ఎన్నికల అనంతరం వైసిపి మరోసారి అధికారం చేపట్టబోతుంది వెంటనే వలంటీర్ల జీతాలను పెంచి వారికి అరుదైన గౌరవం దక్కేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చర్యలు చేపడతారని అన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు చేస్తున్న మంచిని వివరించి వలంటీర్లు ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చింతలరెడ్డి పద్మావతి, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పిసి అల్లూరు రాజు, మండల వైసిపి కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ ఎంపిపి ఇబ్రహం, ఎంపిటిసి దుగ్గిరెడ్డి లక్ష్మీకాంతమ్మ, సర్పంచులు మనగొల రామచంద్రారెడ్డి, చెప్పలి తిరుపతిరెడ్డి, చింతంరెడ్డి రాఘవ యాదవ్, ఎంపిడిఒ అబ్దుల్‌కలాం ఆజాద్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కావలి రూరల్

పట్టణంలోని 1వ వార్డు మద్దురపాడు వద్ద గతంలో నిర్మించి ఉన్న టిడ్కో ఇళ్ల 200 నిర్మాణాలు పూర్తయి ఉన్నాయని ఇటీవల కాలంలో కొంతమంది ప్రజలు అక్కడ నివాసాలు ఉంటున్నారని అక్కడ సరైన వసతులు లేవని టిడ్కో ఇళ్ల వద్ద వసతులను వెంటనే కల్పించాలని కోరుతూ మంగళవారం సిపిఎం నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ టిడ్కో ఇళ్లలో కొద్దిమంది ప్రజలు నివాసాలు ఉంటున్నారని ఈ ఇళ్లకు చుట్టూ ప్రహరీ గోడ లేనందున చీకటిపడితే నిర్మానుష్యంగా ఉంటుందని భద్రతా లేనందున ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. వీధిలైట్లు కూడా సక్రమంగా వెలగకపోవడంతో చీకటిలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారన్నారు. ఇళ్ల చుట్టుపక్కల చెట్లు గడ్డి పెరిగి అడవిలా ఉన్నందున పాముల బెడద ఎక్కువగా ఉందని చీకటి పడితే అక్కడ ప్రజలు వీధులలో తిరిగే పరిస్థితి లేదని తాగునీటి సరఫరా కూడా రెండు రోజులకి ఒకసారి సరఫరా జరుగుతున్నందున కూలి పనులు చేసుకునే పేదలకు నీటి కష్టాలు తప్పడం లేదని తెలిపారు. సంవత్సరాల తరబడి అక్కడ నివాసాలు ఉంటున్న ప్రజలకు సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ సమస్యలన్నిటినీ ఈ రోజు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తప్పకుండా సమస్యలను పరిష్కారం చేస్తానని సిపిఎం నాయకులకు హామీ ఇచ్చారని సమస్యలు పరిష్కరించకపోతే అక్కడ ప్రజలతో కలిసి ఆందోళన చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వై.కృష్ణమోహన్, జి.మధుసూదన్ రావు, నాయకులు బి.కృష్ణయ్య, సీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ, మరుగుదొడ్లు కూల్చివేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడ, తాత్కాలిక మరుగుదొడ్లు కనీస సమాచారం లేకుండా సోమశిల ప్రాజెక్టు నాలుగవ డివిజన్ అధికారులు కూల్చి వేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.వాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ఆర్‌పల్లి పాఠశాలలకు చుట్టూ ప్రహరీ ఉండేదని, ఈ పాఠశాలకు నాడు- నేడు పనుల కింద తరగతి గదులు మరుగుదొడ్లు మంజూరు చేశారని తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణం కోసం పాత మరుగుదొడ్లు తొలగించి నూతనంగా నిర్మిస్తున్నారని, విద్యార్థుల అవసరాల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ప్రహరీ గోడ ఆనుకొని నిర్మించారని తెలిపారు. ఈ పాఠశాలకు ఉత్తరం వైపు ఉన్న సోమశిల ప్రాజెక్టు నాలుగవ డివిజన్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని, అందులో భాగంగా పాఠశాల వైపు ప్రహరీ గోడ నిర్మాణానికి పాఠశాలకు చెందిన ప్రహరీని తొలగించారన్నారు. దాంతోపాటు తాత్కాలిక మరుగుదొడ్లు తొలగించారన్నారు. ఇదంతా వారి చిత్తానుసారం చేశారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుకు మాట మాత్రం కూడా చెప్పకపోవడంతో ప్రధాన ఉపాధ్యాయులు ఉన్నత అధికారులకు విషయం తెలియజేశారు. ఈ పాఠశాలలో 100 మంది బాలురు, 130 మంది బాలికలు పాటలో చదువుతున్నారన్నారు. అందుబాటులో ఉన్న మరుగుదొడ్లు తొలగించడంతో వారు ఇబ్బందులు దాంతో ఇంకా పనులు పూర్తికాని మరుగుదొడ్లనే వీరు వాడాల్సి వస్తుందని తెలిపారు. తొలగించిన ప్రహరీ పాఠశాలకు చెందినదని దానిని ఆనుకొని సోమశిల ప్రాజెక్టు నాలుగో డివిజన్ కార్యాలయం ప్రహరీ నిర్మించుకోవచ్చు కానీ ఇలా చేయడం వల్ల విద్యార్థులు మరుగుదొడ్లకు ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆమె ఆవేదన చెందారు.

ఉచిత కంటి వైద్యశిబిరం ప్రారంభిస్తున్న సర్పంచులు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ మండలంలోని వెల్లంటి హైస్కూల్లో ఎస్ఇఐసి ఎనర్జీ ఇండియా, ఎల్ వి ప్రసాద్ ప్రసాద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ వైద్యశిబిరానికి పాతవెల్లంటి, కొత్తవెల్లంటి, సజ్జాపురం, గొల్లకందుకూరు గ్రామాల నుంచి సుమారు 90మందికి పైగా వచ్చి వైద్యం చేయించుకున్నారని తెలిపారు. అందులో 65మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశామన్నారు. 22మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు పూడిపర్తి జనార్ధన్, పాతవెల్లంటి, కొత్తవెల్లంటి పంచాయతీల సర్పంచులు పాదర్తి రాధ, లక్ష్మమ్మ, విద్యాకమిటీ చైర్మన్ వెంకటరమణమ్మ, పాతవెల్లంటి మాజీ సర్పంచ్ పల్లవరపు చెంచయ్య, గ్రామపెద్దలు పాదర్తి పెదపెంచలయ్య, పాదర్తి మస్తానయ్య, విజన్ టెక్నీషియన్లు రవికిరణ్, సుమంత్, కోఆర్డినేటర్ పి.మనోజ్‌బాబు, సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యాపారస్తులతో మాట్లాడుతున్న కమిషనర్ ఫజులుల్లా

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా తెలియజేశారు. మంగళవారం బిఎస్ఆర్ సెంటర్‌లో మెకానిక్ షాపులు నిర్వహించే ఆటోనగర్ ప్రాంతం వివిధ షాపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఫజులుల్లా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రోడ్లపై వాహనాలు పెట్టి రిపేర్లు చేసుకోవడం వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని షాపుల నిర్వాహకులకు సూచించారు. రానున్న రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయని ఈ ప్రాంతంపై ఆర్‌డిఒ ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అధికారులకు ఇబ్బందులు కలిగించే అవకాశాలు ఉన్నందు వల్ల ఇబ్బందులు కలకుండా రిపేర్లు చేసే సమయంలో వాహనాలు రోడ్డుపై పెట్టకుండా చూడాలని షాపులు నిర్వాహకులకు సూచించారు. ఆయనవెంట ఆర్ఐ ఖాసీం, మున్సిపల్ అధికారులున్నారు.

రామిరెడ్డి గెలుపునకు సమిష్టి కృషి


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు బిఎంఆర్

ప్రజాశక్తి-కావలి

కావలి నియోజకవర్గం ఎంఎల్ఎగా మూడోసారి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని గెలిపించేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నాయకులు కార్యకర్తలు ఎలాంటి అంతరాలు లేకుండా సమిష్టిగా కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఎంఎల్ఎ నివాసంలో పట్టణ నాయకులతో జరిగిన "ఆత్మీయ సమావేశం"లో బీదా మస్తాన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనహాస్య చాతుర్యంతో కూడిన ప్రసంగంతో ఆద్యంతం చప్పట్లు కొట్టించడంతోపాటు నాయకుల్లో ఉత్సాహం నింపారు. తనసొంత పంచాయతీ ఇస్కపల్లిలో ఈ సారి ఎంఎల్ఎకు 20వేల ఓట్లమెజార్టీ తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానని లేనిపక్షంలో ఇక రాజకీయాల్లో ఉండనంటూ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర సూచనలిచ్చారు. కొన్ని పత్రికలు పదేపదే అవాస్తవాలతో దుష్ప్రచారం చేస్తున్నాయని పూర్తిగా ఆ పార్టీ కరపత్రాలులా మారిపోవడం బాధాకరమన్నారు. అవతల పార్టీలో రోజుకో ఇన్‌ఛార్జిలంటూ అయోమయం కాగా వైసిపిలో అంతా క్లియర్‌గా ఉన్నందున నాయకులు, కార్యకర్తలు ఆ అబద్ధాల ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టాలన్నారు. లేకుంటే తటస్థులు ఆ గోబెల్స్ ప్రచారం మాయలో పడే ప్రమాదముందన్నారు. ప్రధానంగా తటస్థులపై దృష్టి పెట్టి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలు వివరించి, వారి మద్దతు సమీకరించాలని బీదా సూచించారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గెలుపే లక్ష్యంగా ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నిర్ణయాలను సంపూర్ణంగా ఆమోదించి ప్రతిఒక్కరూ కష్టపడాల న్నారు. గెలిచిన తర్వాత ప్రతాప్‌కుమార్ రెడ్డికి ఉన్నత స్థానం లభిస్తుందని, కష్టపడ్డ ప్రతిఒక్కరికీ సముచిత ప్రాధాన్యతనివ్వడం ఖాయమని బీదా మస్తాన్ రావు తెలిపారు. గ్రామీణంలో వర్గాల కారణంగా ఓటర్లలో పెద్దగా మార్పులుండవనీ, అయితే కావలి పట్టణంలో తటస్థుల నిర్ణయాలు ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలూ అలాంటి వారిపై దృష్టిపెట్టి తటస్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధిని ఓపికగా వివరించి మళ్లీ వైసిపికి ఓట్లేసేలా ఒప్పించాలని కోరారు. ఇక అందరూ వార్డులలో, గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారంలో ఉండాలని, కాలక్షేపాలకూ అలకలకూ విరామమివ్వాలన్నారు. ఏదైనా అవసరమైతే తానూ కూడా అందుబాటులో ఉంటానన్నారు. ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదేళ్లలో సిఎం జగన్ సుపరిపాలన

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందించారని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని విరువూరు గ్రామంలో నిర్వహించిన విజయసంకల్పయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రజల దశదిశ మారిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తిరుపతి నాయుడు, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అలీఅహ్మద్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి సిద్ధయ్య, తిరువూరు వైసిపి నాయకులు కత్తులపల్లి రామచంద్రారెడ్డి, గడ్డం నర్సారెడ్డి, గోను శ్రీకాంత్‌రెడ్డి, ముడియాల మురళి, తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-దగదర్తి

పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం దగదర్తి మండలం నారాయణపురం (దక్షిణమిట్ట)లోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా వక్తృత్వ –వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి మాట్లాడుతూ పిల్లలు పసిప్రాయంలో మాతృభాష ద్వారా నేర్చుకోవడం మొదలు పెట్టి, తరువాత మరోభాష నేర్చుకుంటే వారి విద్యా జీవితం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగుతుందని వివరించారు. ప్రధానోపాధ్యాయులు డాక్టర్ చీదరాల చెన్నయ్య మాట్లాడుతూ తెలుగుభాష ఎంతో తియ్యనైనదని, ఎందరో మహానుభావులు దేశ భాషలందు తెలుగులెస్స అని పలికారని తెలియజేశారు. కార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు, స్కూల్ చైర్మన్ వేగూరు శీనయ్య, వేగూరు వెంకయ్య, మోర్ల గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సంగం

మండలంలోని కోరిమెర్ల గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో విజయాభవ యాత్రను చేపట్టిన ఎంఎల్ఎకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రూ.22లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్ల నిర్మాణాలతో పాటు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలకు ఎంఎల్ఎ ప్రారంభోత్సవం చేశారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా మంజూరైన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి పలు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు కూరపాటి ప్రసాద్ రెడ్డి, జెడ్‌పిటిసి రావుల లక్ష్మి, వెంకటేశ్వర్లు నాయుడు, ప్రసాద్ గౌడ్, మల్లి, రఘునాథ రెడ్డి, చందన్ కుమార్, ఫణీంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి కావ్య క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి

వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు జనం కసితో సిద్ధంగా ఉన్నారని టిడిపి కావలి ఇన్‌ఛార్జి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చించటానికి తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు మీరు సిద్ధమా అని వైసిపి నేతలకు సవాల్ విసిరారు. అభివృద్ధిపై చర్చకి రావాలంటూ తమ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ఇటీవల విసిరిన సవాల్‌కు వైసిపి నేతలు ఇంతవరకు స్పందించలేదని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అమలు చేసిన 120కి పైగా సంక్షేమ పథకాలను జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే రద్దు చేశారని గుర్తు చేశారు. తెలుగుదేశం పాలన అనగానే నిరుద్యోగ భృతి, ఇన్నోవా కార్లు, పసుపు కుంకుమ, రుణమాఫీ, చంద్రన్న బీమా, అమరావతి, పోలవరం, పట్టిసీమ, ఒకటిన్నర లక్షల ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ, రూ.16 లక్షలకోట్ల పెట్టుబడులు, 10లక్షల ఉద్యోగాలు, చంద్రన్న కానుక ఇలాంటివి ఎన్నో గుర్తొస్తాయన్నారు. మరోవైపు జగన్ మోహన్‌రెడ్డి పాలన గురించి చెప్పాలంటే గొడ్డలి పోటు, కోడి కత్తి, ఇసుక, మట్టి దోపిడీ, సంపూర్ణ మద్యపాన నిషేధం, పింక్ డైమండ్, వారంలో సిపిఎస్ రద్దు, ప్రతియేటా మెగా డిఎస్‌సి, జాబ్ క్యాలెండర్ లాంటి ఉత్తుత్తి కబుర్లు తప్ప ఇంకేమీ కనిపించదన్నారు. ఓటమిని ముందుగానే గ్రహించిన జగన్‌మోహన్ రెడ్డి 77మందిని ఎంఎల్ఎలను బదిలీలు చేశారని, మిగిలిన వారిని కూడా మరో 50రోజుల్లో మడత పెట్టేందుకు జనం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలు కలలో కూడా మరిచి పోరని, పది రూపాయలు ఒక చేత్తో ఇచ్చి రూ.100 దోచుకోవడమే జగన్‌రెడ్డి చెబుతున్న సంక్షేమమా అని ప్రశ్నించారు. జరగబోయే ఎన్నికల్లో వైసిపికి ఘోర పరాభం తప్పదని, మళ్లీ చంద్రబాబు నాయుడు సిఎం అయ్యి రాష్ట్రాన్ని సరైన దారిలో నడిపిస్తారన్నారు.

దళితుల భూములను కాపాడాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి-ఉదయగిరి : 1971లో ఎస్‌సి మాదిగ వర్గానికి చెందిన తమ పూర్వీకులకు ఇచ్చిన ప్రభుత్వ భూములను కాపాడాలని మంగళవారం తహశీల్దార్ నెహ్రూబాబుకు ఎపిఎంఆర్ పిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు నల్లిపోగు ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు వారు మాట్లాడుతూ గతంలో ఇందిరా గాంధీ హయాంలో 1971లో స్థానిక అరుంధతీయ పాలెంలో నివసిస్తున్న దళితులమైన తమ పూర్వీకులకు భూములను మంజూరు చేశారని తెలిపారు. అప్పటినుండి ఇప్పటివరకు మెట్టపైర్లు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో కొందరు రాజకీయ నాయకులు ప్రభావంతో తమపేర్లను తొలగించారని తొలగించిన వారిలో కొందరు దళితులు నగదును ఇచ్చి తొలగించిన పేర్లను వారు నమోదు చేసుకున్నారన్నారు. నగదు చెల్లించలేని మరికొందరు దళితుల భూములు ఎప్పటికీ ప్రభుత్వ కాలనీ స్థలం అని చూపిస్తూ ఉండడంతో ఇటీవల నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం జరుగుతున్నడంతో కొంతమంది మా భూములను చదును చేసుకునేందుకు సిద్ధమయ్యారని, వారి నుండి మా భూములు రక్షణ పొందుటకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో తమ భూములకు తమ పేర్లపై నమోదు చేసి అనుభవంలో ఉండేలా చూడాలని వారు కోరారు. వెంటనే స్పందించిన తహశీల్దార్ సంబంధిత విఆర్‌ఒకు పంపి వెంటనే పరిశీలన చేసి తగు న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ దళితులమైన మాదిగల భూముల దగ్గరకు వస్తే ఎంతటి వారైనా సహించేది లేదని తమ దళిత సంఘం తరపున ఎంత దూరమైనా పోరాడి సాధించుకుంటామని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి భూములను కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల సమావేశం

మాట్లాడుతున్న కావ్యక్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులతో మంగళవారం కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దగ్గుమాటి వెంకట కావ్యక్రిష్ణారెడ్డి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు మాజీ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు పాల్గొని వారు మాట్లాడారు. వైసిపి పార్టీ నాలుగున్నర సంవత్సరంలో ఎక్కడ అభివృద్ధి జరగలేదని, నాలుగున్నరేళ్లలో ఇసుక, గ్రావెల్ మాఫియా పెరిగిపోయిందని టిడిపి హయంలో వేసిన మంచినీటి సరఫరాను 90శాతం పూర్తి చేస్తే వాటి పనులను ఇంతవరకు చేయకపోవడం వైసిపి చేతకాని ప్రభుత్వం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, బీదా గిరి, లెల్లపల్లి సుధీర్, ఎల్ మాధవరావు ఎన్నా బత్తిన వెంకటేశ్వర్లు, రఘురాం నాయుడు, ఆవుల సురేష్ బాబు, టిడిపి సీనియర్ నాయకులు, మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

వివరాలు తెలియజేస్తున్న అధికారులు

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి-సీతారామపురం : గత పది రోజులుగా మండలంలోని 14 పంచాయతీల్లో 2022 ఏప్రిల్ నుండి 2023 మార్చి ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై 13వ సామాజిక తనిఖీ బృందం పొందుపరిచిన నివేదికను మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం వివరాలను ప్రోసిడింగ్ అధికారులకు వివరించారు. మండలంలో మొత్తం రూ.7.4కోట్ల ఉపాధి పనులు జరగ్గా దానిపై నిర్వహించిన ప్రజావేదికలో రూ.81,142లను అధికారులు రికవరీ చూపించారు. అధికంగా మారంరెడ్డిపల్లి పంచాయతీలో 35,189 రూపాయల రికవరీని విధించారు. ప్రతి కూలీకి వందరోజుల ఉపాధి పనులను కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డ్వామా పిడి వెంకటరావు, క్వాలిటీ కంట్రోల్ అధికారి వేణుగోపాల్, అంబుడ్స్ అధికారి వెంకటరెడ్డి, డిఇఇ సెక్షన్ అధికారి దామోదర్, ఎపిడి గాయత్రి దేవి, ఎస్ఆర్‌పి బుజ్జి, ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి, ఎంపిడిఒ అబ్దుల్ కలాం ఆజాద్, ఎపిఒ సుభాషిణి, ఇసి సువర్తయ్య, తదితరులున్నారు.

కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 339 / 2022

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, కందుకూరు బ్రాంచ్ తర్పున చీఫ్ మేనేజరు, కందుకూరు – వాది

Vs

మొగిలి రాజేష్ కుమార్, వగైరా – ప్రతివాదులు

దావా సమను

To,
1. **మొగిలి రాజేష్ కుమార్,** తండ్రి **వెంకటయ్య,** హిందూ, వయస్సు 44 సం॥లు, ఆఫీసు సబార్డినేట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వలేటివారిపాలెం గ్రామం మరియు మండలం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

పై నెంబరున వాది మీపైన దావా పరిహారంనకు డిక్రీ కోరుతూ దాఖలు చేసిన సదరు దావా నెం.339/2022 నందు మీ యొక్క దావా సమను నిమిత్తం శ్రీయుత కోర్టు వారు **తే23-02-2024ది** నకు వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు అనగా **తే23-02-2024ది ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టు వారియెదుట మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 23-02-2024

కోర్టువారి ఉత్తర్వుల మేరకు
యం.మల్లికార్జున రావు,
బి.కాం., బి.యల్.,
వాదితర్పు న్యాయవాది

కందుకూరు
21-02-2024

కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 152 / 2020

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, కందుకూరు బ్రాంచ్ తర్పున చీఫ్ మేనేజరు, కందుకూరు – వాది

Vs

మెస్సర్స్ శ్రీనివాస మెడికల్స్, వగైరా – ప్రతివాదులు

దావా సమను

To,
1. మెస్సర్స్ శ్రీనివాస మెడికల్స్ తర్పున ప్రొప్రైటర్ **కొల్లూరి హరిబాబు,** పామూరు బస్టాండు, కందుకూరు పట్టణము, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.
2. **కొల్లూరి హరిబాబు,** తండ్రి **మాలకొండయ్య,** హిందూ, వయస్సు 43 సం॥లు, వ్యాపారం, నూకవరం గ్రామం, వలేటివారిపాలెం మండలం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

పై నెంబరున వాది మీపైన దావా పరిహారంనకు డిక్రీ కోరుతూ దాఖలు చేసిన సదరు దావా నెం.152/2020 నందు మీ యొక్క దావా సమను నిమిత్తం శ్రీయుత కోర్టు వారు **తే22-02-2024ది** నకు వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు అనగా **తే22-02-2024ది ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టు వారియెదుట మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 22-02-2024

కోర్టువారి ఉత్తర్వుల మేరకు
యం.మల్లికార్జున రావు,
బి.కాం., బి.యల్.,
వాదితర్పు న్యాయవాది

కందుకూరు
21-02-2024

BEFORE THE ADMINISTRATOR GENERAL-STATE SUCCESSION COURT
(For The State of Andhra Pradesh)
(Testamentary & Intestate Jurisdiction)
AT HIGH COURT, Amaravati
(DISTRICT JUDGE CADRE)
C.A. No. 1 of 2024

BETWEEN
Janga Saisubhankar, Son of Late **Janga SaiKumar,** Age:29Yrs, H. No. 27-2-1265, 2nd Floor, Near Y K Achari School, Balaji Nagar, Nellore, Andhra Pradesh-524002 ...Applicant
AND
1.**The State Bank of India,** 15-506, L C Reddy Heights, Venkatrampuram, Nellore, SPSR Nelllore District, Andhra Pradesh – 524002 & ALL CONCERNED ...Respondent/s

PUBLIC NOTICE

The above-named Applicant has filed C.A. No.1 of 2024 for the grant of Succession Certificate/Letter of Administration under section 29 of the Administrator General Act, 1963, for the operation of safe deposit Locker No (1/2) and claim the locker contents with a deposit amount of Rs. 25,000/- (by way of Term Deposit account No. 38891456057 taken in lieu of locker no. 1/2) in the 1st Respondent Bank in the name of the deceased Late Janga Lakshmi (Date of Death: 9th May 2021), who is the mother of Applicant, and the father of the Applicant is Late Janga Sai Kumar (Date of Death: 13th May 2021). The operation of the said certificate is to be effected by the 1st Respondent. The said C.A. stands posted on 19th March 2024, at 11:00 AM. If anybody has any objection to the grant of the above relief in favour of the said Applicant, they may file their objections before the undersigned on the said date. Otherwise, the matter will be heard and decided as per the rules.

By order of the Administrator General Court
SRI G. SIVA PRASAD REDDY
Advocate for the APPLICANT
13-65, Sitanagaram, Tadepalli, Guntur Dist.
PH. No. +91 9963941199

రైతులకు సూచనలు

ప్రజాశక్తి-కలువాయి: మండలంలోని చవటపల్లి, తోపు గుంట, చీఫ్ నాపే గ్రామాలలో పచ్చిశనగ, జొన్న పైరులను పరిశీలించి ప్రస్తుతం ఉన్న చీడపీడలను గురించి వ్యవసాయ అధికారి వి. ప్రతాప్ వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఖుషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు డాక్టర్ కె.కిరణ్ పచ్చి శనగలు, నూతన వంగడాలు, జొన్నలో నూతన వంగడాలను పరిశీలించారు. దిగుబడి వాటి విశిష్టత గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో పొదలకూరు ఏడిఏ కె.శివ, రైతులు పాల్గొన్నారు.

ఎపిఎస్ఐడిసి డైరెక్టర్‌గా 'తలారి'

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నూతన డైరెక్టర్ గా నెల్లూరు రూరల్ నియోజకవం గంలోని 21వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్‌కు చెందిన వైసిపి నాయకులు తలారి విఠల్ బాబును నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి సహాయ సహకారాలతో విఠల్ బాబును ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్ గా నియమించడం జరిగింది. ఆయన ఈ పదవిలో రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారు. తనకు రాష్ట్రస్థాయి డైరెక్టర్ పదవి వచ్చేందుకు కృషి చేసిన నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డికి ప్రత్యేక కతజ్ఞతలు తెలుపుతున్నానని తెలిపారు.

మద్యం షాపుల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మద్యం దుకాణాల నిర్వహణపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యాన ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మద్యం షాపుల సూపర్వైజర్లకు రానున్న ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా, విధి నిర్వహణలో చొరవ చూపి ప్రభుత్వానికి, మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ అవగాహన సమా వేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి, సిఐ శ్రీని వాసులు, ఎక్సైజ్ సిఐ తిరుమలేశ్వర్ రెడ్డి, ఎస్ఐ గురువేశ్వరి, తోటపల్లి గూడూరు ముత్తుకూరు, ఇందుకూరుపేట మద్యం షాపుల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గిరిపుత్రులకు పిఎంయు చేయూత

ప్రజాశక్తి-కొడవలూరు

గిరిపుత్రులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో పిఎంయు (ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్) పూర్తిస్థాయిలో చేయూతనిస్తోందని మండలంలోని నార్తు రాజుపాలెం వినాయక నగర్ రైల్వే ట్రాక్ పక్కన 40 గిరిజన (యానాది) కుటుంబాలున్నాయి. వీరికి ఆధార్ హౌస్ హోల్డ్ మ్యాపింగ్ జాబ్ కార్డ్ రైస్ కార్డులు బ్యాంక్ ఖాతాలు ఓటర్ గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం పథకాలకు దూరంగా ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన పిఎంయు సంస్థ వీరిపై ప్రత్యేక దృష్టి సాధించి ఆ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ బషీర్ కొద్ది రోజులుగా ఆ కాలనీలో పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలు అందా లంటే ఎవరెవరికి ఏం చేయాలో గుర్తించారు. కార్యక్రమంలో ఆ సంస్థ ఏపీఐఓ(అడిషనల్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ ఆఫీసర్)లు సుధాకర్, జాన్, ఫీల్డ్ ఆఫీసర్ మస్తాన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి. నాగభూషణమ్మ, సుదర్శన పాల్గొన్నారు.

'ఫ్యానుకు రెక్కలు విరగడం తథ్యం'

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

రానున్న ఎన్నికల్లో ప్రజా వ్యతిరేకతతో వైసీపీ ఫ్యానుకు రెక్కలు విరగడం తథ్యమని జనసేన నెల్లూరు జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనక్రాంత్ రెడ్డి జోస్యం చెప్పారు. మంగళవారం 54వ డివిజన్ ఇస్లాంపేట నుంచి జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబుతో కలిసి జనం కోసం జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను ప్రజలకు అందించి జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేకతతో ఇప్పటికే దాదాపుగా మూలనపడిన ఫ్యానుకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు పూర్తి స్థాయి రెక్కలు విరిచేయడం ఖాయమన్నారు. ఇప్పటికే వైసీపీ నేతలు అనేక మంది ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారని, త్వరలో నగరంలో కూడా వైసీపీ ఖాళీ కానున్నదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి సింగిల్ డిజిట్ కూడా రాదన్నారు. వై నాట్ 175 అనే భ్రమతో ముఖ్యమంత్రి జగన్ ఉన్నారని పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. కార్యక్రమంలో 53, 54వ డివిజన్ క్లస్టర్ ఇన్‌ఛార్జి, జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, 54 డివిజన్ ఇన్‌ఛార్జ్ సుల్తాన్ బాషా, నగర నాయకులు కాంతర్, కరీం, జీవన్ అలహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు

పత్రికా స్వేచ్ఛను కాపాడండి

నినాదాలు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-టిపి గూడూరు

ప్రజాస్వామ్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో వాక్ స్వాతంత్ర్య భావ ప్రకటన స్వేచ్ఛ తదితర హక్కులు కాపాడాల్సిన బాధ్యత ఆయా రాజకీయ పార్టీలపై ఎంతైనా ఉందని ఇందుకూరుపేట మండల పత్రికా విలేకరులు పేర్కొన్నారు. మంగళవారం ప్రజాసంఘాల నేతలతో కలిసి మండల పరిషత్ కార్యాలయం వద్ద పత్రికా స్వేచ్ఛను కాపాడండి అంటూ బ్యానర్లతో, నల్ల జెండాలతో నినాదాలతో హోరెత్తించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి బహిరంగ సభ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణ పై జరిగిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి కొడాలి నాని ఈ సంఘటనపై చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సిఐటియు జిల్లా ఆటో యూనియన్ నేత మారు బోయిన రాజా మాట్లాడుతూ రాజకీయ పార్టీల నేతలు హుందాగా వ్యవహరించాలని ప్రజావాణి వినిపించే విలేకరులపై కక్ష సాధింపులు పనికిరావన్నారు. ఈ సంఘటన పై సమగ్ర విచారణ జరిపి దాడి చేసిన వారిని శిక్షించాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందన్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ఆయా పార్టీలలోని బాధ్యులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసనలో సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, విలేకరులు జనార్దన్ రావు, రవి, సురేష్, రవీంద్ర, మాధవ్, సనత్, నాగరాజు పాల్గొన్నారు.

వలంటీర్లకు అభినందనలు

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

నిత్యం ప్రజా సమస్యలను ప్రభుత్వం తరఫున పరిష్కరించడంలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ, వార్డు వాలంటీర్లు అందరికీ శుభాభివందనాలు తెలియజేస్తున్నానని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి చెప్పారు. నిస్వార్ధంగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా సేవలు అందిస్తున్న వాలంటీర్ సోదర, సోదరీమణులను నిండు మనసుతో అభినందిస్తున్నానని వ్యాఖ్యానించారు. మానవసేవే మాధవ సేవగా భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాల సాధనలో కీలకభూమిక పోషిస్తున్న వాలంటీర్ సోదర, సోదరీమణులకు భవిష్యత్తులో మంచి మేలు జరుగుతుందని ఆ దిశగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. నిస్వార్ధంతో ప్రజా సేవలందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ అభివద్ధి ఫలాలను, పథకాలను ఎప్పటికప్పుడు అవినీతి రహితంగా, ఎటువంటి దళారీ వ్యవస్థకు చోటు లేకుండా ముఖ్యమంత్రి జగనన్నకు సైనికులుగా నిలబడిన గ్రామ, వార్డు, సచివాలయాల్లో పనిచేస్తున్న వాలంటీర్ల అందరిని మనస్ఫూర్తిగా మరోసారి అభినందిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు మంగళవారం నెల్లూరు నగరంలోని రామ్మూర్తి నగర్ లోని పరమేశ్వరి కళ్యాణ మండపంలో 1, 2, 12,17, 18, 19 డివిజన్ల వాలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలను అందించే కార్యక్ర మాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులు పొందిన వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు, షీల్డ్స్ అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ పొట్లూరు స్రవంతి, క్లస్టర్ -1 అధ్యక్షుడు ముడియాల రామిరెడ్డి, పాముల రమణయ్య, పాల్గొన్నారు.

అభినందిస్తున్న ఎంపి ఆదాల

మెప్మా కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: సంజన సిన్హా ట్రైనీ కలెక్టర్ మంగళవారం మెప్మా జిల్లా కార్యాలయంలో ఫైల్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెప్మా ద్వారా అమలవుతున్న పథకాల గురించి మెప్మా పీడీ డాక్టర్ డి.రవీంద్ర ద్వారా తెలుసుకున్నారు. అనంతరం టీ.ఈ.లు, సిఎంఎంతో ప్రోగ్రాం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. మెప్మాలో అమలవు తున్నటువంటి 19 పథకాల పనితీరుకు ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

ఓటర్లకు అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైనదని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్ర సహకారంతో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వెంకటాచలంలోని జూనియర్ ప్రభుత్వ కళాశాలలో ఓటరు అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా మురళీమోహన్ రాజు మాట్లాడుతూ ఓటరుగా నమోదైన వారే ఓటు హక్కును వినియోగించుకునే వీలున్నందున ముందుగా వయోజనులు తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. 18 ఏళ్ల నిండిన యువతీ యువకులందరినీ ఓటర్లుగా నమోదు చేసేందుకు ఎన్నికల సంఘం వివిధ వర్గాల ద్వారా, పలు రకాల ప్రచారాల ద్వారా ప్రోత్సహిస్తుందని తెలిపారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఓటరు ఓటుతోనే జాతికి దిశా నిర్దేశం చేసే నాయకత్వాన్ని ఎన్నుకుంటారు. ఈహక్కు ఈ దినం భారత వయోజనుల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కుకు అంకితమైందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జ్ ఎ.సురేందర్, మోటివేటర్ టి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న కోటంరెడ్డి కుటుంబ సభ్యులు

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ: నిత్యం ప్రజల శ్రేయస్సు కోరి అభ్యున్నతకు పాటుపడుతున్న కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని ఆదరిస్తే మరిన్ని సేవలు అందిస్తారని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ , కుమార్తెలు హైందవి, వైష్ణవిలు పేర్కొన్నారు. 18వ డివిజన్, సర్వేపల్లి కాలువ కట్టలో మంగళవారం వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని, చంద్రబాబు నాయుడు, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని, ప్రతి ఇంటికి వెళ్లి అభ్యర్థించారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నిత్యం ప్రజల కోసం శ్రమించే నాయకుడు అన్నారు. అటువంటి వ్యక్తిని ఎన్నుకుంటే ప్రజలకు మరింత సేవలు అందిస్తారన్నారు.

ప్రచారం చేస్తున్న మాజీమంత్రి నారాయణ సతీమణి

బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

పొంగూరు నారాయణ మంత్రిగా ఉన్న సమయంలో నెల్లూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని.. పేద ప్రజల కోసం టిడ్కో ఇల్లు నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషిచేసి నిత్యం ప్రజల కోసం పనిచేశారని ఆ సేవే ప్రజలు గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన సతీమణి పొంగూరు రమాదేవి పేర్కొన్నారు.నెల్లూరు నగరం 39వ డివిజన్‌లో బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం ఆమె నిర్వహించారు. డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె ప్రతీ ఇంటికెళ్లి...రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి...నారాయణని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు నారాయణ చేసిన అభివృద్ధేనని.. 2019 నుంచి 2024 వరకు నెల్లూరు నగరంలో ఏ ఒక్క అభివృద్ధి జరగలేదని ప్రజలే నాకు చెబుతున్నారన్నారు.